సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 31 । ఆగస్టు । 2023



సిరిసిల్లలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు



స్వీట్స్ దుకాణంలో కొనుగోలుదారుల సందడి



రాఖీ సందడి

నాకు నువ్వు రక్షా.. నీకు రాఖీ రక్షా.. అంటూ సోదర, సోదరీమణుల ఆప్యాయతకు ప్రతీక అయిన రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు తోబుట్టువులు రెడీ అయ్యారు. వివిధ రకాల డిజైన్లతో రాఖీలు మార్కెట్లో ఆకట్టుకుంటుండగా కొనుగోళ్లతో సందడిగా మారాయి. రక్షాబంధన్ సందర్భంగా మిఠాయి దుకాణాల్లో గిరాకీ నెలకొంది. పలురకాల స్వీట్లు నోరూరిస్తుండగా.. కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. నేడు రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేక కథనం..

- 8లో ▸



న్యూస్‌రీల్

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నాటికి 18ఏళ్లు నిండిన విద్యార్థులు బీఎల్‌వోల ద్వారా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటుహక్కులేని విద్యార్థులు ఫారం-6 నింపి బూత్‌లెవల్ అధికారికి సమర్పించాలని తెలిపారు. ఆర్డీవో ఆనంద్ కుమార్, స్వీప్ నోడల్ అధికారి కె.నర్సింహులు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ మధు, ప్రిన్సిపాల్ రజని పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం అఖిలపక్ష నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ప్రజల్లోకి వెళ్లినప్పుడు అర్హులైన ఓటర్లు నమోదు అయ్యే విధంగా చూడాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సహకరించాలని, చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. ఈవీఎంల అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో సూచించారు. బీఆర్ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న, బండి దేవదాస్, బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కల్యాణచక్రవర్తి, టీడీపీ నాయకులు మోత రాజిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.కరుణాకర్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు కమలాకర్ పాల్గొన్నారు.

డీఆర్‌డీవోగా శ్రీనివాస్



సిరిసిల్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీవో)గా నక్క శ్రీనివాస్‌ను నియమిస్తూ.. ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబరు 450ని బుధవారం జారీ చేసింది. వేములవాడ ఆర్డీవో ఆఫీస్‌లో ఏవోగా పని చేసిన శ్రీనివాస్‌కు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. శ్రీనివాస్‌ను డీఆర్‌డీవోగా నియమిస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఆయన గతంలో వేములవాడ తహసీల్దార్‌గా పని చేశారు.

పత్తాలేని ‘పునరావాసం’



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ అజ్మీరా గోరవ్వ. బుగ్గారాజేశ్వరతండా. భర్త మోతిలాల్ అనారోగ్యంతో మరణించగా నాటుసారా తయారీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. రెండుసార్లు అధికారులు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పునరావాస పథకం కింద రూ.2లక్షలు ఇవ్వడంతో ఆ సొమ్ముతో పాడిగేదెలను కొని, కుటుంబాన్ని పోషించుకుంటుంది.



ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాకు చెందిన గిరిజన యువకుడు మాలోతు మంగ్యా నాటుసారా తయారీచేసి విక్రయిస్తూ అనేక సార్లు పట్టుబడ్డాడు. అధికారులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. రెండోసారి సారా విక్రయిస్తూ పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా విధించారు. మూడోసారి మళ్లీ దొరకడంతో జైలుకు పంపారు. నెల రోజులు జైలు జీవితం గడిపాడు. పునరావాస పథకం నిలిపివేతతో మంగ్యా లాంటి వారెందరో ప్రత్యామ్నాయ ఉపాధి లేక నాటుసారాను తయారీచేస్తూ జైలుపాలవుతున్నారు.



బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు(ఫైల్)

జిల్లాలో కేసులు ఇలా

సంవత్సరం	కేసులు
2019	15
2020	25
2021	116
2022	123
2023	87
ఇప్పటివరకు పట్టుకున్న సారా	1,365 లీటర్లు
బెల్లం పానకం	26,380 లీటర్లు

- మళ్లీ గుడుంబా వైపు అడుగులు
- గతంలో రూ.1.12 కోట్లతో 56 కుటుంబాలకు ఉపాధి
- నాలుగేళ్లుగా నిలిచిన పథకం
- ఏటా పెరుగుతున్న గుడుంబా కేసులు
- జైలు పాలవుతున్న‘గిరిజనం’

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుడుంబా రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపేందుకు పునరావాస పథకాన్ని ప్రవేశపెట్టింది. మూడేళ్లపాటు అమలైన పథకం తర్వాత నిలిచిపోయింది. ఫలితంగా గిరిజనులు మళ్లీ గుడుంబా విక్రయిస్తూ కేసులపాలవుతున్నారు. గత నాలుగున్నరేళ్లలో జిల్లాలో 366 మందిపై కేసులు నమోదయ్యాయి. యువత సైతం గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడడం కలకలం రేపుతోంది.

56 కుటుంబాలకు ఉపాధి

జిల్లాలో గుడుంబా బాధితుల పునరావాస పథకం(జీఈటీఆర్ఎస్)ను 2016 నుంచి 2018 వరకు అమలు చేశారు. ఆ సమయంలో రూ.1.12 కోట్లతో 56 కుటుంబాలకు ఉపాధి కల్పించారు. వందశాతం సబ్సిడీపై రూ.2 లక్షల చొప్పున అందజేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారు ఆటోలు, టెంట్‌హౌస్‌లు, గేదెలు, గొర్రెల పెంపకం, బ్యాంగిల్ స్టోర్స్ వంటివి ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. గత నాలుగేళ్లుగా పథకం నిలిచిపోవడంతో గిరిజనులు మళ్లీ గుడుంబా తయారీ వైపు అడుగులు వేస్తున్నారు. యువత సైతం సారా తయారీతో కేసుల పాలవుతున్నారు.

పథకం నిలిపివేతతో..

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, వేములవాడరూరల్, ఇల్లంతకుంట మండలాలో నాటుసారాను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 2016 నుంచి 2018 వరకు పల్లెల్లో గుడుంబా తయారీ, విక్రయాలను నిలిపివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పునరావాస పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం అర్ధంతరంగా నిలిచిపోవడంతో గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి కరువై మళ్లీ సారా తయారీనే జీవనాధారంగా ఎంచుకున్నారు. ఫలితంగా 2018 నుంచి ఏటా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఒకసారి సారా విక్రయిస్తూ దొరికి బైండోవర్ అయిన వారు మళ్లీ సారా విక్రయిస్తూ దొరికి జైలు జీవితం గడుపుతున్నారు. జరిమానాలు సైతం చెల్లించారు.

వారి జీవితాల్లో వెలుగు

మూడేళ్లపాటు పునరావాస పథకాన్ని ప్రభుత్వం అమలు చేయగా జిల్లాలో 56 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి దొరికింది. ప్రస్తుతం వారంతా సారా తయారీకి స్వస్తి చెప్పి గేదెలు, గొర్రెలు, ఇతరత్రా పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. పునరావాస పథకం అమలు చేసి ఉంటే గుడుంబా రహిత జిల్లాగా మారేది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఈ పథకాన్ని కొనసాగించాలని గిరిజన, గిరిజనేతరులు కోరుతున్నారు.

పథకాన్ని కొనసాగించాలి



ప్రత్యామ్నాయ ఉపాధి లేక గుడుంబా తయారీ వైపు మళ్లుతున్నారు. 2016లో పథకం ప్రవేశపెట్టడంతో నాటుసారా తయారీకి దూరంగా ఉన్నారు. పథకం అందకపోవడంతో మళ్లీ అదే మార్గాన్ని ఎంచుకున్నారు. రూ.లక్ష చొప్పున జరిమానాలు చెల్లిస్తూ.. జైలు జీవితాలు అనుభవిస్తున్నారు.

– అజ్మీరా రాజునాయక్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉపాధి లేక సారా తయారీ



గిరిజనుల ఉపాధి కోసం ప్రభుత్వం జీఈటీఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా వ్యాప్తంగా 56 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. వారంతా ప్రస్తుతం గుడుంబా విక్రయాలకు దూరంగా ఉంటున్నారు. పథకం నిలిపివేతతో ఉపాధి లేక కొంత మంది మళ్లీ సారా తయారీ చేస్తున్నారు. గుడుంబా తయారీపై నిరంతరం నిఘా ఉంచుతున్నాం. అయినప్పటికీ కొందరు నాటుసారాను దొంగచాటుగా తయారు చేస్తున్నారు.

– ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రమేశ్‌బాబు

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రధాన సలహాదారుగా నియామకమైన వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందించారు. రూ.704కోట్లతో కలికోట సూరమ్మ చెరువు ఎత్తిపోతల పథకం, మధ్యమానేరు ముంపు గ్రామాల రూ.40 కోట్ల పెండింగ్ నిధుల విడుదల, ఎల్లంపల్లి నిధులు రూ.42కోట్లు, మిగతా పనులకు మరో రూ.42 కోట్లు కేటాయించాలని కోరారు. కోనరావుపేట మండలంలో మూడు, వేములవాడలో ఒక వంతెన, అన్ని మండలాల్లో రహదారులకు రూ.140కోట్లు, రుద్రంగి, బీమారంలలో 30పడకల ఆసుపత్రి నిర్మించాలని విన్నించారు. వేములవాడ రాజన్న ఆలయం, పట్టణ సమగ్రాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.100 కోట్లు, రోడ్డు వైండింగ్, కట్టకింద నూతన బస్టాండ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరగా.. సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అధిక ధరలపై పోరాటం



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: అధిక ధరలు, నిరుద్యోగంపై దశలవారీగా పోరాటం చేపడుతామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు అన్నారు. బుధవారం సిరిసిల్ల పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 10 నుంచి 17వరకు సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, గన్నేరం నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పండుగలు.. పనులకు నిధులు

- రూ.67.17లక్షలు కేటాయిస్తూ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం
- వివరాలు వెల్లడించిన చైర్‌పర్సన్ జిందం కళ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: పండుగలకు నిధులు.. ఇటీవల కురిసిన వర్షాలతో తెగిన చెరువుల మరమ్మతులకు ఆమోదం తెలుపుతూ సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. బుధవారం ఉదయం 11గంటల నుంచి చైర్‌పర్సన్ జిందంకళ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సాధారణ సమావేశంలో వివిధ అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఏర్పాటు మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం రూ.67.17 లక్షలు మంజూరుకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. రూ.43.50లక్షల వ్యయంతో వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా మానేరువాగుతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాట్లకు లైటింగ్, సౌండ్‌సిస్టమ్, జేసీబీ, బ్లేడ్‌ట్రాక్టర్లతో పనులు చేయించడానికి ఖర్చు చేస్తామని తెలిపారు. ఇటీవల భారీ వర్షాలతో తెగిన చిన్నబోనాల పెద్దచెరువుకు రూ.17.67లక్షలతో మరమ్మతు చేపడతామని వివరించారు. రూ.5లక్షలతో హరితహారం పనులు నిర్వహిస్తామని అన్నారు. పెద్దూరు బైపాస్‌రోడ్డులోని సర్వేనంబరు 408లో 44ఎకరాల మోడల్ లేఅవుట్‌గా అభివృద్ధి చేయడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఎజెండాలోని అన్ని అంశాలను కౌన్సిల్ ఆమోదించినట్లు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్ నిరసన

సిరిసిల్లలో జరుగుతున్న అక్రమాలను నిలువరించేవారు లేకపోతున్నారని బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగారాజు గౌడ్ ఆరోపించారు. చిన్నబోనాల చెరువు తాత్కాలిక మరమ్మతుకు రూ.17లక్షలు ఎందుకని ప్రశ్నించారు. వార్డుల్లో మోటార్ల రిపేర్లకు, ఇతర పనులకు పైసల్లేవని అధికారులు చెబుతున్నారని అన్నారు. మున్సిపల్ నిధులు పక్కదారి పడుతున్న వైనాన్ని బీజేపీ ఖండిస్తోందని.. ఈ విషయమై మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

కంప్యూటర్ విద్యపై దృష్టి పెట్టాలి

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



నామాపూర్ మోడల్‌స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులతో కలెక్టర్ అనురాగ్

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు కంప్యూటర్ విద్యపై దృష్టి సారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో మోడల్‌స్కూల్‌ను బుధవారం పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. వారి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. సిలబస్‌తోపాటు కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం, బాలికల హాస్టల్‌ను సందర్శించారు.

పల్లె దవాఖానాలపై నమ్మకం కలిగించాలి

జిల్లాలోని పల్లె దవాఖానాలపై ప్రజలకు నమ్మకం కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ పీహెచ్‌సీలో పల్లె దవాఖానాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు పల్లెదవాఖానాల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో ఇటీవల ప్రసవాలు పెరిగాయని, దానికి కారణమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులను వివరించి, కౌన్సెలింగ్ చేయాలన్నారు. అనంతరం పోతుగల్ రహదారి పక్కన మొక్కలు నాటారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, ఉప వైద్యాధికారి శ్రీరాములు, వైద్యాధికారి గీతాంజలి, సూపర్‌వైజర్లు మెంగని లింగం, ప్రసాద్, హెచ్ఈవో యాదగిరి, ఎల్‌టీ ప్రవీణ్ పాల్గొన్నారు.

‘చెన్నమనేని’ పేరు ఇక శాశ్వతం!

- కాళేశ్వరం 9వ ప్యాకేజీకి రాజేశ్వర్‌రావు పేరు
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం
- నేడు చెన్నమనేని రాజేశ్వర్‌రావు శతజయంతి



మల్కపేట జలాశయంలోకి ఎత్తిపోస్తున్న పంపు(ఫైల్)



సీహెచ్.రాజేశ్వర్‌రావు(ఫైల్)

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీకి ‘చెన్నమనేని రాజేశ్వర్‌రావు’ పేరును రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఆరుసార్లు విజయం సాధించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఎత్తిపోతల పథకాల కోసం పోరాడిన నేతగా గుర్తింపు పొందిన స్వర్గీయ చెన్నమనేని రాజేశ్వర్‌రావు శతజయంతి(ఆగస్టు 31న) సందర్భంగా 9వ ప్యాకేజీకి ఆయన పేరును ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. మధ్యమానేరు నుంచి గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు వరకు 9వ ప్యాకేజీలో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్, కాల్వలు, ఇతర అన్ని నిర్మాణాలకు ‘చెన్నమనేని రాజేశ్వర్‌రావు’ పేరును ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. రాజేశ్వర్‌రావు తనయుడు చెన్నమనేని రమేశ్‌బాబు వేములవాడ ఎమ్మెల్యేగా 2009నుంచి నాలుగు పర్యాయాలు ఎన్నికయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీకి రాజేశ్వర్‌రావు పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలే మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను రెండు పంపుల ద్వారా ఎత్తిపోశారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 9వ ప్యాకేజీ పనులకు ‘చెన్నమనేని’ నామకరణం చేయడం విశేషం.

ఉద్యమాల యోధుడికి ప్రత్యేక గుర్తింపు

కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1923 ఆగస్టు 31న జన్మించారు. 2016 మే 9న హైదరాబాద్‌లో అనారోగ్యంతో మరణించారు. 1957లో తొలిసారిగా చొప్పదండి నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. అంతకుముందు నిజాం వ్యతిరేకపోరాటంలో, తెలంగాణ విముక్తి ఉద్యమంలో మడమతిప్పని పోరాటం సాగించారు. 1967, 1978, 1985 ఎన్నికల్లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో రైతు సంఘం జాతీయ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా పనిచేస్తూ అసెంబ్లీలో ఉన్నారు. 1999 ఎన్నికలకు ముందు సీపీఐకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

సేఫ్ ద్వారా నీటి పథకాలు

రాజేశ్వర్‌రావు తన తనయుడు రమేశ్‌బాబు ద్వారా జర్మనీ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిధులు సమకూర్చి సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో ‘సేఫ్’ అనే స్వచ్ఛంధ సంస్థ ద్వారా నీటి పథకాలను, వాటర్ షెడ్ పనులను చేశారు. సామాజిక సేవలో ముందున్న రాజేశ్వర్‌రావు మెట్ట ప్రాంతానికి సాగు నీరు సాధించేందుకు ఎత్తిపోతల పథకం తప్ప మరో మార్గం లేదని పదేపదే చెప్పే వారు. ఆయన ఆశయాలను నిజం చేస్తూ.. సిరిసిల్ల, వేములవాడ మెట్ట ప్రాంతానికి సీఎం కేసీఆర్ గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాధించారు. రాజేశ్వర్‌రావు కలలు నిజమయ్యాయి.

సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం

- సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి
- జాక్టో రాష్ట్రనాయకుల పిలుపు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ పొందడం హక్కుఅని జాక్టో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు మర్వాడి గంగరాజు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో మాట్లాడుతూ కార్పొరేట్ ప్రభుత్వాలు ఉద్యోగుల నెత్తినరుద్దిన సీపీఎస్ భూతం అమలుకాబడి దశాబ్ద కాలమవుతోందని, అందుకే సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన నిలబడి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాక్టో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్కుర్తి లక్ష్మీ నారాయణ, పులి రాంగోపాల్, వేణుగోపాల్, అజయ్, పిట్టల దేవరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వప్నికకు రూ.లక్ష పారితోషికం



స్వప్నికను సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: ఇటీవల షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన పట్టణానికి చెందిన విరంచి స్వప్నికకు మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం రూ.లక్ష పారితోషికం అందించారు. రంగు విరించి స్వప్నిక కొన్ని సంవత్సరాల నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ వస్తోంది. ఇటీవల షార్జాలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను శాలువాతో సన్మానించి రూ.లక్ష అందజేశారు.

నలుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. నంబరు ప్లేట్ లేని వాహనాలపై తిరిగితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు పోకిరీల పట్టివేత

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న నలుగురు పోకిరీలను పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని అన్నారు. జిల్లాలోని మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100, జిల్లాలోని షీటీం నంబర్ 87126 56425కు సమాచారం అందిస్తే వెంటనే రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరికి మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: కాంట్రాక్టర్లను బెదిరించి చందాలు వసూలు చేయడానికి ప్రయత్నించి కుంటయ్య, నగునూరి రవికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి హిమబిందు బుధవారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2019లో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ల వద్ద చందాల వసూలు చేయడానికి కుంటయ్య, నగునూరి రవి ప్రయత్నించారు. ఇదే క్రమంలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు సిరిసిల్లబైపాస్‌లో తపంచాతో పట్టుబడగా అప్పటి సీఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ చెలుమల సందీప్ వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధించారు.

అడ్డొచ్చిన అడవి పందులు.. ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం శివారులోని అటవీప్రాంతంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల వివరాలు.. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాకు చెందిన నవీన్, భూక్య సంతోష్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్లకు వెళ్లి తిరుగుప్రయాణంలో వెళ్తుండగా అటవీప్రాంతంలో ఒకేసారి అడవిపందుల గుంపు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీ కొట్టిన యువకులు అదుపు తప్పి రోడ్డుకింద పడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్

- తోబుట్టువుల అనురాగాలకు సూచిక
- నేడు రాఖీ పౌర్ణమి



రాఖీ వేడుకలు జరుపుకుంటున్న కరీంనగర్‌లోని రాజస్థానీ అన్నాచెల్లెల్లు

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్: ఆధునికయుగంలో అనుబంధాలు ఇంకా తరిగిపోలేదు. ఉమ్మడి కుటుంబాలు తగ్గినా పేగుబంధాలు ధృడంగానే ఉన్నాయి. ఎక్కడ ఉన్నా పరస్పర యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయత పంచుతూ తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేది రక్షాబంధన్. సోదరీసోదరుల ఆత్మీయ బంధానికి ప్రతీక అయినా రక్షా బంధన్‌ను గురువారం దేశవ్యాప్తంగా జరుపుకోనున్నారు. పండుగ రోజున పుట్టిళ్లు సందడిగా మారుతాయి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల ముంజేతులన్నీ వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడుతాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కట్నకానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షాబంధన్‌ను రాఖీపౌర్ణమి, జంద్యాల పౌర్ణమిగా పిలుస్తారు.

పండుగ ఎలా ప్రారంభమైందంటే..

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కర కాలం జరిగిన యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడు సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్గిస్తుంది. సరిగా ఆ రోజు శ్రావణ పౌర్ణమి కావడంతో పార్వతిపరమేశ్వరులు, లక్ష్మీనారాయణను పూజించి రక్షాను దేవేంద్రుని చేతికి కడుతుంది. దేవతలందురూ పూజించిన రక్షాలను ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. అలా రాఖీ పండుగా మొదలైందని పురాణాలు చెబుతున్నాయి. అన్నాతమ్ముళ్లకు కట్టే రక్షాబంధన్ ద్వారా వారు తలపెట్టే కార్యాలు విజయవంతం కావాలని, సుఖసంతోషాలు, సిరి సంపదలు కలగాలని ఆకాంక్షించే విశిష్టత రాఖీ పండుగకు ఉంది. నూతన వస్త్రాలు, బహుమతులతో ఆనందంగా గడుపుతారు. బ్రిటీష్‌వారు దేశాన్ని పాలిస్తున్న కాలంలో వారి ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. స్త్రీలు రక్షణ కోసం వీరయోధులకు రక్షాబంధన్ కట్టేవారు. సోదరభావంతో యోధులు మహిళలకు రక్షణ కల్పించేవారు. రాణి కర్ణావతి దుర్గాన్ని శత్రువులు ముట్టడించినప్పుడు ఢిల్లీ బాదుషాకు రాఖీ పంపంది. బాదుషా ఆమెను సోదరిగా భావించి శత్రువులను తరిమికొట్టి ఆమె ఇంట్లో భోజనం చేసి కానుకల సమర్పించినట్టు చరిత్ర.

ఆన్‌లైన్ రక్షాబంధన్

కాలం మారడంతో పాటు రక్షబంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదురులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే కట్టకొని తోబుట్టువులకు కానుకలు పంపుతుండే సంప్రదాయం నేటికి కొనసాగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావడంతో ఆన్‌లైన్ ద్వారా రాఖీలను పంపి ఆన్‌లైన్ ద్వారానే కానుకులు స్వీకరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకునే వెసులుబాటు ఉంది. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కుచెదరలేదు.

తమ్ముడంటే ప్రాణం



మా ఇంట్లో మేము ముగ్గురం, మాకు తమ్ముడు అన్వేశ్ అంటే ప్రాణం, ప్రస్తుతం వాడు హుస్నాబాద్‌లోని శ్రీనివాస హాస్పిటల్ ఇన్‌చార్జి. రాఖీపండుగ రోజు ఎంత బిజీగా ఉన్నా వాడి దగ్గరికి వెళ్లి మేమిందరం కలిసి రాఖీ కడతాం. తమ్ముడు కూడా మా కోసం ప్రతీ పండుగకు ఎదురుచూస్తుంటాడు, వాడి ప్రేమాభిమానాలు ఎప్పటికీ కావాలి. వాడు ఆనందంగా ఉండాలని, ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటాం.

– స్రవంతి, అమూల్య, కరీంనగర్

ముగ్గురు అన్నదమ్ములు



నాకు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అన్నలు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. తమ్ముడు మాత్రం కరీంనగర్‌లో మాతోనే ఉంటాడు, రైస్‌మిల్లు ఉంది. ప్రతి పండుగకు ఇద్దరు అన్నలు కళ్లముందు లేకున్న రాఖీ పంపిస్తాను. ఇక్కడ ఉండే కృష్ణకు మాత్రం స్వయంగా రాఖీ కడతాను.

– సింగిరికొండ మాధవి, తిరుమలనగర్, కరీంనగర్

ఈ సమయాలు అనుకూలం



గురువారమే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలి. శుభకార్యాలు, పండుగలకు సూర్యోదయ తిథి ప్రమాణంగా పాటించాలి. ఉదయం 6.30 నుంచి 9.45, మళ్లీ 10.50 నుంచి 11.50 నిమిషాల మధ్య, మధ్యాహ్నం 12.30 నుంచి 2.45 వరకు, సాయంత్రం 3.45 నుంచి 6.00 గంటల మధ్య రాఖీలు కడితే శుభకరం.

– శ్రీతాటిచెర్ల హరికిషన్‌శర్మ, పురోహితుడు

పద్మశాలీ ఆత్మగౌరవ ప్రతీక

- నేడు మార్కండేయ స్వామి రథోత్సవం, శోభాయాత్ర
- భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

సిరిసిల్లకల్చరల్: భృగు వంశ వారసులుగా కీర్తి గడించిన పద్మశాలీయులు పెద్ద సంఖ్యలో హాజరవుతూ నిర్వహించే వేడుక నూలు పౌర్ణమి. చేనేత, మరమగ్గాల పరిశ్రమకు, వస్త్రోత్పత్తికి, పద్మశాలీయుల సంఖ్యాపరమైన ఆధిక్యతకి పేరెన్నిక గన్న సిరిసిల్ల పట్టణంలో నూలు పౌర్ణమిని వైభవంగా జరపడం తరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తమ ఇలవేల్పుగా భావించే మహర్షి మార్కండేయుడి శోభాయాత్రను ఘనంగా జరిపేందుకు పద్మశాలీయులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నటు పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు.

ప్రత్యేక పూజలు

నూలు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం 11 గంటలకు సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

సామూహిక యజ్ఞోపవీత ధారణలు

నూలు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పద్మశాలీయులు నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు. ఆయా కుటుంబాల్లో వ్యక్తి గత ధారణలతో పాటు మార్కండేయ దేవాలయంలో చేరి సామూహికంగా పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

సాయంత్రం శోభాయాత్ర

నూలు పౌర్ణమి పుణ్యతిథి సందర్భంగా పట్టణ వీధులన్నీ పద్మశాలీయుల సందడితో నిండి పోతుంది. ప్రధాన వీధులన్నీ పద్మశాలీ పతాకాలతో నింపేశారు. తమకు ప్రధాన జీవనాధారమైన నూలు పోగులను పవిత్రంగా భావిస్తూనే కుల దైవం మార్కండేయ స్వామిని శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగిస్తారు. అదే రథంపై మగ్గం నేయడం, వస్త్రం తయారీ చేసి స్వామికి నివేదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేస్తాయి. మార్కండేయ స్వామి శోభాయాత్ర పురవీధుల గుండా సాగుతుంది. గాంధీ సర్కిల్, అంబేడ్కర్ చౌక్, పాతబస్టాండ్, పెద్ద బజార్, శ్రీవేంకటేశ్వర దేవాలయం, గాంధీచౌక్ మీదుగా తిరిగి మార్కండేయ దేవాలయానికి చేరుతుంది. యాత్ర పొడవునా కోలాటాలు, భక్తి సంకీర్తనలు, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పద్మశాలీయుల ఆత్మగౌరవాన్ని చాటుకునేలా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం బాధ్యులు గోలి వెంకట రమణ తెలిపారు.

వీడని మిస్టరీ

'సాయి.. నేను, దీప్తి అక్క మద్యం తాగాలని అనుకున్నం.. కానీ నేను తాగలేదు.. అక్కనే తాగింది.. నేను నా ఫ్రెండ్‌తో తెప్పించా.. అది ఒప్పుకుంటా.. ఇంకా అక్కవాళ్ల బాయ్‌ఫ్రెండ్‌ను పిలుస్తా అంటే నేను వద్దన్నా.. అయినా పిలుస్తా అంది.. సరే లే నీ ఇష్టం అన్నా.. నేను ఇంట్లో నుంచి వెళ్లిపోదామనుకున్నా.. నిజమే.. అది నేను ఒప్పుకుంటా.. అక్కకు చెప్పి వెళదామనుకున్నా.. కానీ.. అప్పటికే అక్క హాఫ్ బాటిల్ వోడ్కా కంప్లీట్ చేసింది.. అంతకుముందే ఫోన్‌లో మాట్లాడింది. తర్వాత సోఫాలోకి వెళ్లి పడుకుంది.. నేను లేపితే లేవలేదు.. పడుకుంది కదా.. అని డిస్టర్బ్ చేయలేదు.. చాన్స్ దొరికింది కదా అని.. నేనే ఇంట్లో నుంచి వెళ్లిపోయా.. నా తప్పేం లేదు.. నాకు అక్కను చంపే ఉద్దేశమే లేదు.. ఇలా అవుతుందని అనుకోలేదు.. అక్కను నేనెందుకు చంపుతా.. నా దగ్గర డబ్బులు లేవు కాబట్టి ఇంట్లో నుంచి తీసుకెళ్లా'

– తన తమ్ముడు సాయి మొబైల్‌కి చందన పంపిన వాయిస్ మెసేజ్ ఇది..

- అక్క మృతితో నాకు సంబంధం లేదు
- ఫ్రెండ్‌కు చెప్పి మద్యం నేనే తెప్పించా
- ఎవరో బాయ్‌ఫ్రెండ్‌కు అక్క ఫోన్ చేసింది
- తమ్మునికి చందన వాయిస్ మెసేజ్
- డబ్బులు.. బంగారం మాయం
- దీప్తి ఒంటిపై గాయాలు..?
- పోలీసు బృందాల గాలింపు



సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలు

కోరుట్ల: చందన తాను అక్కను చంపలేదని తమ్ముడు సాయికి వాయిస్ మేసేజ్ పంపడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మెసేజ్ ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు. కోరుట్ల బస్టాండ్‌లో మంగళవారం ఉదయం కనిపించిన సీసీ ఫుటేజీ చిత్రాలు.. చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్‌వి కావనే సమాచారంతో విచారణ గందరగోళంగా మారింది. అదయితే, చందన బాయ్ ఫ్రెండ్ కారులో వచ్చి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చందన ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు మరోసారి పరిశీలిస్తున్నారు. ఆమె వాయిస్ మేసేజ్ వచ్చిన సెల్‌ఫోన్ ఆధారంగా రెండు బృందాలు హైదరాబాద్‌కు చేరుకుని గాలింపు చేపట్టాయి.

దీప్తి ఒంటిపై గాయాలు..!?

- అనుమానస్పదంగా మృతి చెందిన దీప్తి ఒంటిపై స్వల్పగాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు సమాచారం.
- దీప్తి టీషర్ట్ కింద శరీరం కాస్త కమిలిన గాయాలు, చెంపపై గీసుకుపోయినట్లుగా ఓ చిన్న గాయం ఉన్నట్లు తెలిసింది.
- దీంతోపాటు దీప్తి చేతులు కట్టేసినట్లుగా మణికట్టు వద్ద గాయం ఉన్నట్లు సమాచారం.
- ఒకవేళ చేయి విరిగి ఉంటే బంక దీప్తి హత్యకు గురైందన్న అంశానికి మరింత బలం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతాయి.
- సాధారణంగా పోస్టుమార్టం నివేదికకు సంబంధించిన షార్ట్ రిపోర్టు అదే రోజు అందించే ఆనవాయితీ ఉన్నా.. వైద్యులు ఈ విషయంలో కుదరదని చెప్పినట్లు తెలిసింది.

డబ్బులు, నగలు మాయం

బంక శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, సుమారు 50 తులాల వరకు బంగారు ఆభరణాలు మాయమైనట్లు సమాచారం. ఇంట్లోనుంచి వెళ్లిపోయిన చందన.. డబ్బులు తాను తీసుకున్నట్లు వాయిస్ మేసేజ్‌లో చెప్పినా.. బంగారం విషయం ఎత్తలేదు. బంగారం సైతం చందన తీసుకెళ్లి ఉంటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చందన తన క్లాస్‌మేట్ ఒకరితో కొన్నాళ్లుగా సన్నిహితంగా ఉంటోందని, అతడితో కలిసి డబ్బులు, నగలు తీసుకు వెళ్లి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

దారి మళ్లిస్తున్నారా?

చందన తమ్మునికి పంపిన వాయిస్ మేసేజ్‌లో దీప్తి తన బాయ్‌ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఇంటికి రమ్మంటానని చెప్పిందని, తాను వద్దన్నానని చెప్పిన తీరు సంఘటనను దారి మళ్లించేందుకేనా? అనే అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. వాయిస్ మేసేజ్‌తో ఇంట్లో నుంచి చందన వెళ్లిపోయిన తర్వాత వేరెవరో వచ్చి ఉంటారన్న రీతిలో అనుమానాలు వచ్చేలా ఉండటం గమనార్హం. చందన, ఆమె బాయ్ ఫ్రెండ్ కలిసి దీప్తి చనిపోవడానికి తమకు సంబంధం లేదని నమ్మించడానికి ఈ రకంగా మేసెజ్ పెట్టారా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ దిశలో పోలీసు దీప్తి సెల్‌ఫోన్ డాటాను పరిశీలిస్తున్నారు.

నిరసనలు.. ఆందోళనలు



అంబేడ్కర్ చౌరస్తాలో రెండో ఏఎన్‌ఎం దీక్షలు



కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష

- కలెక్టరేట్‌ను ముట్టడించిన సీపీఎం
- సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆది శ్రీనివాస్ సంఘీభావం
- కొనసాగుతున్న మాజీ సర్పంచులు, రెండో ఏఎన్‌ఎంల దీక్షలు

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రం సిరిసిల్లలో నిరసనలు ఎగిశాయి. ప్రభుత్వ తీరుపై ట్రేడ్ యూనియన్లు, సీపీఎం, తాత్కాలిక ఉద్యోగులు, రెండో ఏఎన్‌ఎంలు, మాజీ సర్పంచులు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని రెండో ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. పదిహేనేళ్లగా విధులు నిర్వర్తిస్తున్నా.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, నాయకులు కడారి రాములు, తదితరులు సంఘీభావం తెలిపారు. వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి, రేఖ, రాజేశ్వరి, పద్మ, సరోజ, ఇందిర, కరుణశ్రీ, సునంద పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

సమగ్ర శిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్డీవో ఆఫీసు ఎదుట చేపట్టిన రిలేదీక్షలకు మద్దతు తెలిపారు. సమాన పనికి సమాన వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆది శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ తదితరులు సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యం, ఇప్పపూల దేవేందర్, నగేశ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కల్పించాలి

కార్మికవాడల్లోని నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. సిరిసిల్లలోని బీవైనగర్, సుందరయ్యనగర్, పద్మనగర్, రాజీవ్‌నగర్, తారకరామానగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోని నివేశన స్థలాలకు సర్వేనంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, శ్రీరాం సదానందం, ఒద్నాల వీరేశం పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల దీక్షలు

మాజీ సర్పంచులు ఇరవై రెండో రోజు నిరసన దీక్ష కొనసాగించారు. ఇన్ని రోజులుగా తాము నిరవధిక రిలే దీక్షలను చేపడుతుంటే ప్రభుత్వం పట్టింపు లేకుండా ఉండటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మన్,దేవుని నర్సయ్య, గోవర్దన్, సత్యనారాయణరెడ్డి, పైలూరి రాజమల్లు పాల్గొన్నారు.

పాతకక్షలతోనే సతీశ్ హత్య

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- 7 మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం
- డీఎస్పీ రవీందర్‌రెడ్డి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: సంచలనం సృష్టించిన కన్నం సతీశ్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఇందిరానగర్‌కు చెందిన కన్నం సతీశ్ ఈనెల 20న రాత్రి 10.58 గంటల సమయంలో తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి పట్టణ శివారులోని శక్తి బార్ వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న శివాజీనగర్‌కు చెందిన జక్కం రాజేశ్.. సతీశ్‌తో మాటలు కలిపాడు. బార్ సమీపంలోని సందిలోకి తీసుకెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక సతీశ్ తలపై రాజేశ్‌తోపాటు పాతర్ల నవీన్ కర్రలతో దాడి చేశారు. అక్కడే ఉన్న నేరవేణి రమేశ్ ఇటుకతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సతీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. 2015లో రాజేశ్, సతీశ్ మధ్య ఓ విషయంలో వివాదం తలెత్తింది. ఈక్రమంలో సతీశ్.. రాజేశ్‌పై దాడిచేశాడు. కొద్దిరోజుల తర్వాత ఇద్దరి మధ్య రాజీకుదిరింది. ఆ తర్వాత వీరి మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగాయి. వీటిని దృష్టిలో ఉంచుకొనే సతీశ్‌ను హతమార్చారు. దాడిలో పాల్గొన్న ముగ్గురు పారిపోయేందుకు, డబ్బులు సమకూర్చే తదితర విషయాల్లో మెట్‌పల్లికి చెందిన తాటికొండ రామకృష్ణ, గుండు గోపాల్, మిట్టపల్లి రాంమోహన్, కోరుట్లకు చెందిన చింతకింది హరీశ్ సహకరించారు. హత్యలో ముగ్గురు పాలుపంచుకోగా, వారికి సహకరించిన నలుగురిని మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరిపై 302, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురి రికార్డు పరిశీలించాక నేరచరిత్ర ఉంటే పీడీ యాక్ట్ నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్‌ఐలు ఉమాసాగర్, నవీన్ పాల్గొన్నారు.

రాజన్నక్షేత్రంలో రాజకీయ వారసులు

- నియోజకవర్గంలో హీటెక్కిన ఎన్నికల చర్చ
- పార్టీల్లో చేరికలతో చల్మెడ బిజీబిజీ
- బీజేపీలో చేరిన వికాస్‌రావు



ఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

వేములవాడ: రాజన్న క్షేత్రంలో రాజకీయ వారసులొస్తున్నారు. మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు కుమారుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావును బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు తనయుడు చెన్నమనేని వికాస్‌రావు బుధవారం బీజేపీలో చేరారు. దీంతో వేములవాడలో రాజకీయ వారసులొచ్చారంటూ జోరుగా చర్చ జరుగుతోంది.

వైద్య శిబిరాలతో..

వచ్చే ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలని తమతమ స్వచ్ఛందసంస్థల పేర్లతో వైద్య శిబిరాలు, శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావు చల్మెడ గ్రూప్స్ పేరుతో సేవలు చేస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి సీహెచ్ విద్యాసాగర్‌రావు కొడుకు వికాస్‌రావు ప్రతిమ గ్రూప్‌తో సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకెళ్లారు. ప్రస్తుత ఎమ్మెల్యే రమేశ్‌బాబు సేవ్స్ స్వచ్ఛంద సంస్థ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించి నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

కొలిక్కిరాని చెన్నమనేని అసంతృప్తి

వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పౌరసత్వం వివాదం కారణంగా ఈసారి టికెట్ ఇవ్వలేకపోతున్నామంటూ సీఎం కేసీఆర్ ప్రకటిస్తూనే వేములవాడలో చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు టికెట్ కేటాయించారు. దీంతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జర్మనీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న రమేశ్‌బాబు బుధవారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. అయితే ఆపార్టీలోని క్యాడర్‌లో మాత్రం ఇంకా అసమ్మతి సెగలు రేగుతూనే ఉన్నాయి. రమేశ్‌బాబు వేములవాడకు చేరుకుంటే తప్ప అసంతృప్తిగళానికి తెరపడేలా లేదంటూ పార్టీ శ్రేణులు అనుకుంటున్నారు.

గ్రావిటీ కెనాల్ ఇసుక మాయంపై సమగ్ర విచారణ

- జిల్లా మైనింగ్ ఏడీ ఎస్.సైదులు

సాక్షి ఎఫెక్ట్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామ శివారులో గ్రావిటీ కెనాల్ పరిసరాల్లో ప్రభుత్వ పనుల కోసం నిల్వ చేసిన ఇసుక మాయం విషయంలో పూర్తిస్థాయి విచారణ చేపడతామని జిల్లా మైనింగ్ ఏడీ ఎస్.సైదులు బుధవారం 'సాక్షి'కి వివరించారు. ఈ నెల 30న 'తడగొండలో ఇసుక మాయం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ప్రభుత్వ పనుల కోసం ఇరిగేషన్ ఇంజినీర్‌పేరుతో ఇసుక అనుమతులు ఇస్తారని, వనరులను కాపాడాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులదేనని తెలిపారు. ఇసుక నిల్వల విషయంలో ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామని పేర్కొన్నారు. తడగొండ ఇసుకమాయం విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు.